

శ్రీ మందిరం ఆదాయం
నగదు : రూ. 5,99,529
బంగారం : 500 మిల్లీ గ్రాములు
వెండి : 28 గ్రాములు 700 మిల్లీ గ్రాములు
- భువనేశ్వర్/పూరీ

నవమి సోయగం

పూరీలో రామనవమి సోయగం కనిపించింది. అందమైన అలంకరణలు ఆకట్టుకున్నాయి.



- 8లో.



పర్యాటకుల బస్సు బోల్తా

రాజధాని శివారులో పర్యాటకుల బస్సు బోల్తా పడింది. ఒకరు మృతి చెందారు.

- 8లో.

న్యూస్‌రీల్

మూడు చిరుత పులి పిల్లల అలజడి



పట్టుబడిన పులి పిల్లలు

కొరాపుట్: రాష్ట్ర సరిహద్దులో మూడు చిరుత పులి పిల్లలు అలజడి రేపాయి. నబరంగ్‌పూర్ జిల్లా రాయగర్ సమితిలోని ఏటీబీకి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న నహర్‌పూర్ అటవీ ప్రాంతంలోని జునాబాన్ గ్రామ కొండల్లో పులి పిల్లల అరుపులు స్థానిక గిరిజనులకు వినిపించాయి. అక్కడకు వెళ్లి చూడగా మూడు కూనలు కనిపించాయి. తల్లి కూడా అక్కడే ఉంటుందేమోనన్న భయంతో వారు వెనక్కి వచ్చి అటవీ శాఖాధికారులకు సమాచారం అందజేశారు. వారు పులి కూనలను సంరక్షించి తమ కార్యాలయానికి తీసుకెళ్లారు. గ్రామస్తులు పులి సంచారంపై జాగ్రత్తగా ఉండాలని, పిల్లలను వెతుక్కుంటూ వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు.

ప్రజలను మోసం చేసిన వ్యక్తి అరెస్టు



బలిమెల పోలీసులు అరెస్టు చేసిన నిందితుడు సురేంద్ర పరిడా

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా బలిమెల పోలీసుస్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో అమాయక ప్రజలను మోసం చేసిన కేసులో ఒకరిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఢెంకనాల్ జిల్లా కామాక్షి నగర్‌కు చెందిన సురేంద్ర పరిడా అనే వ్యక్తి ఖోయిర్‌పూట్ సమితి రాస్‌బేఢా పంచాయతీలో చెరీగూఢ,బనుగూఢ, బుటిగూ గ్రామాల్లో 50 మంది గిరిజనులకు అధిక వడ్డీ ఆశ చూపించి డబ్బులు వసూలు చేశాడు. 2022 నుంచి ఇలా వసూలు చేశాడు. ఆ మొత్తాన్ని తీసుకుని పరారయ్యాడు. గిరిజనులు బలిమెల ఐఐసీ ధీరజ్ పట్నాయిక్ వద్దకు మార్చ్ 16వ తేదీన వచ్చి ఫిర్యాధు చేశారు. అప్పటి నుంచి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అతడు డెంకనాల్ జిల్లా కామాక్షినగర్‌లో ఉన్నట్లు తెలుసుకుని అక్కడకు వెళ్లి ఆదివారం అరెస్టు చేశారు.

పూరీ జగన్నాథ ఆలయంలో మహిళా జర్నలిస్టుపై సేవకుల దాడి



మహిళా జర్నలిస్టుపై శ్రీ జగన్నాథుని సేవకుల దాడి

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథ ఆలయంలో సేవకులు మహిళా జర్నలిస్టుపై దాడి చేశారు. ఆమెతో పాటు కెమెరా మ్యాన్ దాడికి గురి అయ్యాడు. వీరివురు గాయపడి ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్నారు. ఆది వారం శ్రీ రామ నవమి కవరేజ్ హడావిడిలో ఉండగా సేవకులు వీరిపై దాడికి పాల్పడ్డారు. దాడిలో వీరి కెమెరా, మొబైలు ఫోన్ లాక్కున్నారు. పది మందికి పైగా సేవకులు ఈ దాడిలో పాల్గొన్నారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ దాడికి ప్రతిస్పందనగా స్థానిక మీడియా ప్రతినిధులు పూరీలోని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. జర్నలిస్టుల నుంచి అధికారిక ఫిర్యాదుల మేరకు, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అధికారులు ఈ విషయంపై శ్రద్ధగా దర్యాప్తు చేస్తున్నారని పూరీ ఎస్పీ హామీ ఇచ్చారు. మేము ఇలాంటి సంఘటనలను తీవ్రంగా పరిగణిస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు చేపట్టేందుకు కట్టుబడి ఉన్నామని ఎస్పీ పేర్కొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవంలో భక్తజనం

పర్లాకిమిడి: పట్టణంలోని మార్కెట్ జంక్షన్ కోమటి వీధి వద్ద రామాలయం ఆవరణలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైశ్యరాజు గోవిందరాజు దంపతులు, పొట్నూరు శివ దంపతులు ఆదివారం సాయంత్రం జరిపించారు. రామాలయం ప్రధాన పూజారి అనుమంచిపల్లి రాజగోపాలచారి, అనుమంచిపల్లి ఉగ్రనర్సింహాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన కల్యాణ మహోత్సవాన్ని భక్తులు కనులారా వీక్షించి తరించారు.

అంతా.. రామమయం



రాయగడ: వేషధారణలో చిన్నారి

ఉత్కళ భూమి రాముడి సేవలో తరించింది. వేషాలు కట్టి కొన్ని చోట్ల, వివాహ క్రతువు జరిపి మరికొన్ని చోట్ల, శోభాయాత్రలు నిర్వహించి ఇంకొన్ని చోట్ల రామనవమి వేడుకలు నిర్వహించారు. సీతారాముల కల్యాణాలను వైభవంగా చేసి తరించారు. అధికారులు, నాయకులు, సామాన్యులు అన్న తేడా లేకుండా అందరూ నవమి నాడు రాముడిని సేవించారు.



రాముని అవతారం లో ప్రదర్శన



భజన చేస్తున్న నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి



నబరంగ్‌పూర్ జిల్లా చౌరాముల్లా గ్రామంలో రామాలయంలో నవమి వేడుకలు



రాయగడ: కోదండరామాలయంలో పూజలందుకుంటున్న సీతారాములు



రాయగడ: గద పట్టుకుని ర్యాలీలో పాల్గొన్న యువకుడు



సిమిలిగుడ పట్టణంలో ర్యాలీలో కొరాపుట్ ఎమ్మెల్యే రఘు రాం మచ్చో, మాజీ ఎమ్మెల్యే రఘు రాం పాడాల్ ర్యాలీ



శ్రీరాముడి వేషధారణలో వస్తున్న చిన్నారులకు స్వాగతం పలుకుతున్న దృశ్యం



శ్రీరాముడి వేషంలో విద్యార్థి

పర్లాకిమిడిలో..

పర్లాకిమిడి: పర్లాకిమిడిలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. మార్కెట్ వీధి, కోమటివీధి రామాలయంలో ఎ.రాజగోపాలచారి, ఎ.ఉగ్రనర్సింహాచారి ఆధ్వర్యంలో భక్తులు అర్చనలు చేశారు. అలాగే సింకివీధిలో ఉదయం నుంచి భక్తులు శ్రీరాముని దర్శనార్థం బారులు తీరారు. గుమ్మాబ్లాక్ జీబ పంచాయతీ జోగిపాడు గ్రామంలో శ్రీరామమందిరంలో శ్రీసీతారాముల కల్యాంణం జరిపించారు. కోమటివీధి రామాలయం వద్ద భక్తులకు మజ్జికను కోడూరు జీవన్ పంపిణీ చేశారు.



గుమ్మాబ్లాక్ జోగిపాడు గ్రామంలోని శ్రీసీతారామాలయంలో..

కోర్సండలో..

పర్లాకిమిడి: జిల్లాలో గుసాని సమితి కోర్సండ గ్రామంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా సీతారామ కల్యాణం ఘనంగా జరిపించారు. వరుసగా 25 ఏళ్లగా కోర్సండ గ్రామంలో జరుగుతున్నాయి. ఈ కళ్యాణ మహోత్సవానికి చుట్టు పక్కల గ్రామాలతో పాటు, పాతపట్నం రామరాజు చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పారశెల్లి రామరాజు పాల్గొని సేవ చేశారు.

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో

కొరాపుట్: కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో శ్రీరామ నవమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కొరాపుట్ జిల్లా కేంద్రం లోని శబరి శ్రీ క్షేత్ర జగన్నాథ దేవాలయంలో సీతారామ లక్ష్మణ అవతారంలో దేవ దేవులు దర్శనం ఇచ్చారు. నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి, కొరాపుట్ ఎమ్మెల్యే రఘురాం మచ్చో లు తమ నియోజకవర్గాలలో పర్యటించారు.

రాయగడలో..

రాయగడ: శ్రీరామ నవమి సందర్భంగా స్థానిక భజరంగ్‌దళ్ కార్యకర్తలు, హిందూ సంస్థలు ఆదివారం పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. స్థానిక జగన్నాథ మందిరం నుంచి ఒక బృందం, పీహెచ్‌డీ నుంచి మరో బృందానికి చెందిన యువకులు ర్యాలీలో పాల్గొన్నారు. హనుమంతుల వారి గదలను పట్టుకుని ర్యాలీ చేశారు. స్థానికంగా గల కోదండ రామాలయంలో విశేష పూజలను నిర్వహించారు. అదేవిధంగా బాలాజీ నగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వర ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి.

జయపురంలో..

జయపురం: జయపురంలో శ్రీరామ నవమి ఉత్సవాలతో పట్టణంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్థానిక జమాల్ లైన్‌లో శ్రీరామ మందిర కమిటీ వారు, హిందూ సమాజ్ వారు, రఘునాథ్ మందిర పూజాకమిటీలు అంగరంగ వైభవంగా పూజలు ప్రారంభించారు. ఉదయం జమాల్ లైన్ రామ మందిర కమిటీ శ్రీరామ దంపతుల ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించగా శ్రీరామ మందిరం వద్ద భక్తులు దీపారాధనలు చేశారు. శ్రీరాముని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

సరస్వతి శిశు మందిర్‌లో..

మల్కన్‌గిరి: స్థానిక సరస్వతీ శిశుమందిర్ పాఠశాలలో ఆదివారం రామనవమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల అధ్యక్షుడు రవీంద్ర కుమార్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా గోలక్ చంద్ర దళయి పాల్గొన్నారు. రామాయణ విశిష్టతను పిల్లలకు వివరించారు.



పర్లాకిమిడి మార్కెట్ జంక్షన్ రామాలయం వద్ద బారులు తీరిన భక్తులు



రాయగడ: ర్యాలీలో పాల్గొన్న మహిళలు



కోర్సండ గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవం



పర్లాకిమిడి: జోగిపాడు గ్రామంలో శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం



స్థానిక జమాల్ లైన్ శ్రీరామమందిర ఉత్సవ విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగిస్తున్న నిర్వాహక కమిటీ



శ్రీరాముని ఊరేగింపులో పాల్గొన్న ఒడిస్సీ నృత్య కళాకారిణులు



పర్లాకిమిడి కోమటివీధి జంక్షన్ వద్ద రామాలయంలో..

జిలిమిలిగుడ కెనాల్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జయపురం: జయపురం అప్పర్ కొలాబ్ సాగునీటి ప్రాజెక్టు ధనపూర్ సబ్ కెనాల్ జిలిమిలిగుడ గ్రామ సమీపంలో కెనాల్ నీటిలో గుర్తు తెలియని యువకుని మృతదేహం ఆదివారం లభ్యమైందని జయపురం సదర్ పోలీసు అధికారి సచేంద్ర ప్రధాన్ వెల్లడించారు. కొంతమంది గ్రామస్తులు ఆదివారం ఉదయం జిలిమిలిగుడ కెనాల్ వైపు వెళ్తుండగా.. యువకుని మృతదేహం కెనాల్ నీటిలో తేలి ఉండటాన్ని గమనించి తమకు సమాచారం ఇచ్చారన్నారు. పోలీసులు సంఘటనా స్థలం వద్దకు చేరుకొని అగ్నిమాపక సిబ్బంది సహాయంలో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని వయసు 35 నుంచి 40 ఏళ్లు ఉండవచ్చనని వెల్లడించారు. ఎవరైనా గుర్తు పడితే జయపురం సదర్ పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



విజేత జట్టుకు చెక్కును బహూకరిస్తున్న నెక్కంటి భాస్కరరావు

• రాజ్యసభ మాజీ సభ్యుడు భాస్కరరావు

రాయగడ: యువత క్రీడలపై ఆసక్తి కనబర్చితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని రాజ్యసభ మాజీ సభ్యుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. సదరు సమితి పరిధిలోని కొత్తపేటలో ఉయ్ ఫైట్ అవర్ రైట్స్ అనే సేవా సంస్థ ఆధ్వర్యంలో గత నెల 26వ తేదీన ప్రారంభమైన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత క్రీడారంగంపై దృష్టి సారించాలని అన్నారు. ఆరోగ్యానికి క్రీడలు ఎంతో దోహద పడడంతోపాటు వారి జీవన విధానం కూడా మెరుగుపడుతోందన్నారు. టోర్నమెంట్‌లో ఫైనల్‌కు చేరుకున్న సూరి జట్టు, జేకే కామ్రేడ్ జట్ల మధ్య జరిగిన పోటీలో సూరి జట్టు విజేతగా నిలవగా రన్నర్‌గా జేకే కామ్రేడ్ జట్టు నిలిచింది. విజేత జట్టుకు రు. 25 వేలు, రన్నర్ జట్టుకు రూ. 15 వేలు బహుమతిని నెక్కంటి అందజేశారు. అధికారి చిన్న, గౌరి చైతు, కొండ తదితరులు టోర్నమెంటును నిర్వహించారు.

భూగర్భంలో దొరికిన రాముడి ప్రతిమ



భూగర్భంలో లభించిన శ్రీరాముని ప్రతిమ

భువనేశ్వర్: భూగర్భంలో శ్రీరాముని కాంస్య విగ్రహం బయటపడింది. ఈ సంఘటనతో స్థానికుల్లో ఆనందం వెల్లివిరిసింది. కటక్ జిల్లా బంకి మండలం రొత్తాగొడా గ్రామంలో ఈ సంఘటన వెలుగులోకి వచ్చింది. ఈ గ్రామానికి చెందిన బలరామ్ రౌత్ వివరించిన కథనం ప్రకారం శుక్రవారం రాత్రి అతనికి కల వచ్చింది. ఆ ప్రకారం అతను తన కలలో చూసిన ప్రదేశంలో శనివారం తవ్వి వెతకడంతో విగ్రహం బయటపడింది. ఈ వెలికితీతలో అతనికి రాముడి కాంస్య విగ్రహం కనిపించింది. ఈ సమాచారం చుట్టుపక్కల ప్రాంతాలకు వ్యాపించింది. ప్రజలు తండోపతండాలుగా తరలి వచ్చారు. స్థానికులు రామ నవమి సందర్భంగా భగవంతుని విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ప్రణాళిక వేశారు. ప్రతిమ దొరికిన ప్రదేశం యజమాని దిబాకర్ మల్లిక్ కూడా తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

పర్యాటక కేంద్రాల వద్ద 'స్వచ్ఛభారత్'



మహేంద్రగిరి కుంతీ మందిరం వద్ద చెత్తను ఏరివేస్తున్న అధికారులు



గండాహతి జలపాతం వద్ద పాల్గొన్న బీడీవోలు, ఇతర సిబ్బంది



బృందావన్ ప్యాలెస్‌లో కలెక్టర్ ఇతర అధికారులు

పర్లాకిమిడి: ఒడిశా పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం చారిత్రాత్మక మహేంద్రగిరి పర్వతం, గుడ్‌గుదా, గండాహతి జలపాతాలు, దేవగిరి, ఖోసడా, పర్లాకిమిడిలో బృందావన ప్యాలస్‌లో అధికారులు స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టారు. బి.ఎన్.ప్యాలస్‌లో పేరుకపోయిన చెత్తను శ్రమదానంతో తొలగించారు. జిల్లా కలెక్టర్ బిజయకుమార్ దాస్, సాంస్కృతిక అధికారి అర్చనామంగరాజ్, ఏడీఎం రాజేంద్ర మింజ్, డీఆర్‌డీఏ అధికారి శంకర్ కెరకటా, ఆదనపు ఈవో పృథ్వీరాజ్ మండల్, తహసీల్దార్లు, బీడీవోలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా దేవీ యాత్ర



పుర వీధుల్లో అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు

బరంపురం: భక్తుల కొంగు బగారం.. బరంపురం ఇలవేల్పు 'మా బుధి ఠాకురాని' అమ్మవారి (దేవీ యాత్ర) ఉత్సవాలు ఆదివారం నాల్గో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మేళతాళాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల మధ్య అమ్మవారిని పుర వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తితో అమ్మవారి పాదాలను పసుపు నీళ్లతో కడిగారు. 26 రోజులపాటు నిర్వహించే ఈ ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు.

యోగాతో మానసిక వికాసం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న యోగా గురువు

జయపురం: యోగాతో మానసిక వికాసం కలుగుతుందని యోగా గురువు వికాశ షాడంగి అన్నారు. జయపురం సబ్ డివిజన్ కొట్‌పాడ్ బాలికోన్నత పాఠశాలలో ఇకో క్లబ్, ఫిట్ ఇండియా సంయుక్తంగా యోగా శిబిరం నిర్వహించాయి. ఈ శిబిరంలో కొట్ ప్రాంత ప్రముఖ యోగా గురువు వికాశ షాడంగి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యోగాతో మన జీవన శైలి మారుతుందన్నారు. ప్రతిఒక్కరూ యోగాను అభ్యసించాలన్నారు. ఈ శిబిరంలో విద్యాలయ ఉపాధ్యాయులు సబిత మదల, దమయంతి సాహూ, ప్రభాషిణి లిమల్, సయిత గొలారి, వణిత మహంతి, ప్రియదర్శిణి మండల్, పాఠశాల ఇకో క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు సెంచూరియన్ వర్సిటీ ఉత్కళ కృషి మేళా

పర్లాకిమిడి: సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో మూడవ వ్యవసాయ ఉత్కళ కృషిమేళాను సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎం.ఎస్.స్వామినాథన్ అగ్రికల్చర్ కళాశాల డీన్ డాక్టర్ ఎస్.పి.నంద ఆదివారం తెలిపారు. ప్రారంభ కార్యక్రమానికి బరంపురం ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి, ఎమ్మెల్యే రూపేష్ పాణిగ్రాహి, కలెక్టర్, ఐకార్ (ఢిల్లీ) డాక్టర్ జె.కె.జెన్నా హాజరవుతారన్నారు. వ్యవసాయ మేళాలో రెండు వేల మంది రైతులు పాల్గొంటారన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన జింక

కొరాపుట్: కుక్కల దాడిలో జింక మృతి చెందిన ఘటన ఆదివారం ఉదయం నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్‌కోట్ డైలీ మార్కెట్ సమీపంలో జరిగింది. ఐదు జింకల కదలికలను స్థానికులు గమనించారు. వీధి కుక్కలు వాటిపై దాడిచేశాయి. నాలుగు జింకలు అటవీ ప్రాంతం వైపు వెళ్లిపోయాయి. ఓ జింక కుక్కల బారిన పడింది. గాయపడిన జింకను స్థానికులు పశువుల ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా జింక మృతి చెందింది. తీవ్రమైన ఎండల వలన నీరు, ఆహారం కోసం జింకలు పట్టణంలోనికి ప్రవేశించినట్లు అటవీశాఖ అధికారులు అభిప్రాయ పడ్డారు. అటవీ శాఖ సిబ్బంది అక్కడికి చేరుకొని కేసు నమోదు చేశారు. జింకను పోస్టుమార్టం నిర్వహించారు. కుక్కల సమస్యపై తాము తరచూ మున్సిపల్ సిబ్బందికి ఫిర్యాదుల చేస్తున్నప్పటికీ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మున్సిపల్ సిబ్బంది స్పందించారు. కుక్కల నివారణకు చర్యలు తీసుకుంటామని స్థానికులకు నచ్చజెప్పారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతుడు బలిన్ దుర

ఆమదాలవలస : శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషన్ పరిధిలోని ఊసవానిపేట గేటు సమీపంలో ఆదివారం రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతిచెందాడు. జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదనరావు తెలిపిన వివరాల ప్రకారం .. విశాఖపట్నం నుంచి ఒడిశా వైపు వెళ్లే రైలులో ప్రయాణం చేస్తున్న అసోంకు చెందిన బలిన్ దుర(35) పుట్‌బోర్డుపై ప్రయాణిస్తూ జారిపడ్డాడు. దీంతో అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు జీఆర్‌పీ పోలీసులు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబానికి సమాచారం అందించారు.

• నవమి సోయగం



పూరీ శ్రీ మందిరం సింహ ద్వారం పుష్ప సోయగం



ఖుర్దారోడ్ సాయి జగన్నాథ ఆలయంలో ఉత్సవ హోమం



నీల మేఘ శ్యామునిగా బ్రహ్మగిరి అలార్‌నాథ స్వామి దర్శనం

పవిత్ర శ్రీ రామ నవమి పురస్కరించుకుని రాష్ట్ర ప్రజల ఆరాధ్య దైవం పూరీ శ్రీ జగన్నాథ దేవస్థానం మొదలుకొని రాష్ట్ర వ్యాప్తంగా వాడవాడలా శ్రీ రామ చంద్ర స్వామి పూజాదులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానాల ప్రాంగణాలు ప్రత్యేక పుష్ప సోయగంతో కళకళలాడాయి. హోమాదులతో ఆధ్యాత్మిక వాతావరణం అలముకున్నాయి. – భువనేశ్వర్

• హైడ్రో ప్రాజెక్టు సందర్శన



మీనాక్షి పవర్ ప్రాజెక్టు అధికారులతో చర్చిస్తున్న ప్రభుత్వ అధికార కమిటీ సభ్యులు

జయపురం: జయపురం సబ్ డివిజన్ బొయిపరిగుడ సమితి తెంతులిగుమ్మ పంచాయతీ కొలాబ్ నదిపై నిర్మించిన మీనాక్షి హైడ్రో పవర్ ప్రాజెక్టును ఆదివారం ఏడుగురు సభ్యుల ప్రభుత్వ అధికారుల కమిటీ సందర్శించింది. కొరాపుట్ జిల్లా కలెక్టర్ వి.కీర్తి వాసన్ ఆదేశాల మేరకు ప్రాజెక్టును సందర్శించిన కమిటీ సభ్యులు పలు విషయాలపై ప్రాజెక్టు అధికారులతో చర్చించారు. 2020లో హైదరాబాద్ మీణాక్షి పవర్ ప్రాజెక్టు లిమిటెడ్ వారు ఈ ప్రాజెక్ట్ నిర్మణం చేపట్టారు. సమితి, అటవీశాఖ, కాలుష్య నియంత్రణ బోర్డు అధికారులతో కలిసి కమిటీ సభ్యులు ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించారు. కమిటీ సభ్యులు అడిగిన ప్రాజెక్టు స్కెచ్ మ్యాప్‌ను.. ప్రాజెక్టు అధికారులు చూపించలేకపోయారని, పాత రిపోర్టును ఆధారంగా ప్రాజెక్టు పనులు నిర్వహిస్తున్నట్లు కమిటీ తెలుసుకున్నట్లు సమాచారం. 2020లో పల్లె సభ రిపోర్టును పవర్ కంపెనీ చూపిందని, ఆ రిపోర్టును పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని బొయిపరిగుడ బీడీఓ అభిమన్యు కవి శతపతి వెల్లడించారు. ప్రాజెక్టు పరిధిలో ఉంటున్న ప్రజల అభిప్రాయాలు తెలుసుకుంటామన్నారు. అవసరమైన రికార్డులను మంగళవారం నాటికి అందజేయాలని ప్రాజెక్టు అధికారులను కమిటీ ఆదేశించిందని సమాచారం. జయపురం సబ్ కలెక్టర్ అక్కవరం శొశ్యారెడ్డి పర్యవేక్షణలో జయపురం అటవీ డివిజన్ అధికారి ప్రతాప్ కుమార్ బెహర, జయపురం సమగ్ర గిరిజనాభివృద్ధి ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్, బొయిపరిగుడ తహసీల్దార్, కాలుష్య నియంత్రణ బోర్డు జిల్లా అధికారి, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకుల బస్సు బోల్తా

• ఒకరు మృతి



ఘటనా స్థలంలో బోల్తా పడిన బస్సు పునరుద్ధరణ, సహాయక చర్యలు

భువనేశ్వర్: నగరం శివార్లలో ఆదివారం వేకువ జామున భారీ రోడ్డు ప్రమాదం సంభవించింది. స్థానిక ఉత్తర క్రాసింగ్ ప్రాంతం సిఫా కూడలి కౌశల్యాగంగ పోలీసు ఔట్ పోస్ట్ దగ్గర రోడ్డు ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పర్యాటకుల బస్సు బోల్తా పడింది. బస్సులో ప్రయాణిస్తున్న వారిలో 15 మందికి పైగా పర్యాటకులు గాయపడ్డారు. వారందరినీ స్థానిక క్యాపిటల్ ఆస్పత్రిలో చేర్చారు. ఒకరు మృతి చెందారు. పూరీ ఆలయానికి వెళ్తుండగా ప్రమాదం సంభవించింది. డ్రైవర్ కునుకుపాటు కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. బస్సులో దాదాపు 70 మంది పర్యాటకులు ఉన్నట్లు సమాచారం. వీరంతా బంగ్లాదేశ్ నుంచి ఇస్కాన్ సహాయంతో పూరీ శ్రీ జగన్నాథుని దర్శనం కోసం విచ్చేశారు. కాశీ విశ్వనాథ ఆలయాన్ని సందర్శించిన తర్వాత పూరీ వెళ్తుండగా దురదృష్టవశాత్తు దుర్ఘటన పాలయ్యారు. ప్రయాణికుల్లో అత్యధికులు పశ్చిమ బెంగాల్‌లోని ఇస్కాన్ మాయాపూర్ ఆధ్వర్యంలో వచ్చిన బంగ్లాదేశ్ జాతీయులు అని సమాచారం.

• ఆవిర్భావ కార్యక్రమంలో నాయకులు



నబరంగ్‌పూర్‌లోని పార్టీ కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న ఎంఎల్ఏ గౌరీ శంకర్ మజ్జి

బీజేపీతోనే దేశాభివృద్ధి



బీజేపీ జెండాను ఎగుర వేస్తున్న నాయకులు

భువనేశ్వర్: భారతీయ జనతా పార్టీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. జాతీయవాదం బీజేపీ భావజాలమన్నారు. బీజేపీ 46వ వార్షికోత్సవాన్ని ఆదివారం జరుపుకోవడం ఆనందాయకమని రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యాలయం ప్రాంగణంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ, ప్రధాన కార్యదర్శి పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటాలకు పూలమాలలు వేసి రాష్ట్ర శాఖ ప్రముఖులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

1980 దశకంలో దేశంలో రాజకీయ అస్థిరత నెలకొన్నప్పుడు, భారతీయ జనసంఘ్ సూత్రాలు, ఆదర్శాలు, భావజాలం, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ త్యాగం, లక్ష్యం ఆధారంగా జాతీయ స్థాయిలో రాజకీయ ప్రత్యామ్నాయంగా భారతీయ



వ్యవస్థాపక దినోత్సవానికి హాజరైన ప్రముఖులు

జనతా పార్టీని ప్రారంభించినట్లు నాయకులు పేర్కొన్నారు. పార్టీ అంచెలంచెలుగా ఎలా ఎదిగో నాయకులు వివరించారు. స్థానిక బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి విజయ్‌పాల్ సింగ్ తోమర్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి మానస్ మహంతి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిరంచి నారాయణ్ త్రిపాఠి, రాజ్యసభ సభ్యుడు సుజిత్ కుమార్, లోక్‌సభ సభ్యుడు బలభద్ర మాఝి, భువనేశ్వర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ మిశ్రా పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ వ్యవస్థాపక దినోత్సవం

కొరాపుట్: భారతీయ జనతా పార్టీ 46వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జి బీజేపీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ ప్రతి కార్యకర్త తమ ఇంటి మీద పార్టీని జెండాను ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మహిళా కార్యకర్తలు ఎమ్మెల్యేకు పార్టీ జెండాలతో స్వాగతం పలికారు. రాష్ట్ర ప్రాథమిక విద్య, సాంఘీక సంక్షేమ శాఖా మంత్రి నిత్యానంద గొండో తన స్వంత నియోజకవర్గమైన ఉమ్మర్‌కోట్‌లోని పార్టీ కార్యాలయంలో జెండాను ఎగుర వేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీలో చేశారు.



బీజేపీ జెండాతో నబరంగ్‌పూర్ ఎమ్మెల్యే గౌరీ శంకర్ మజ్జికి స్వాగతం పలుకుతున్న మహిళా కార్యకర్తలు



ఉమ్మర్‌కోట్‌లోని పార్టీ కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న మంత్రి నిత్యానంద గొండో



బీజేపీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న మంత్రి నిత్యానంద

ట్రాక్టర్ బోల్తాపడి ఐదుగురికి గాయాలు



తీవ్రంగా గాయపడిన దీవేన్ మాడీ



ఆస్పత్రి వద్ద క్షతగాత్రులు

మల్కన్‌గిరి: ట్రాక్టర్ బోల్తాపడి ఐదుగురు గాయపడ్డారు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి సుదకొండ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఐదు గంటల సమయంలో చోటుచేసుకుంది. సుదకొండ గ్రామానికి చెందిన భీమా మాడ్కమి, లక్ష్మి పడియమి, దివస్ మాడీ, భీమ పోడియామి, రామా మడ్కమి సమీపంలోని అడవిలో కట్టెలు కొట్టి తిరిగి వస్తుండగా మధ్యలో ట్రాక్టర్ రావడంతో దాన్ని ఎక్కారు. కొద్ది దూరం వెళ్లిన తరువాత ట్రాక్టర్ బోల్తాపడడంతో అదుపు తప్పి పడిపోవడంతో అందులో ఉన్న ఐదుగురు గాయపడ్డారు. వారిని స్థానికుల సహాయంతో కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందించారు. వీరిలో లక్ష్మికి తీవ్రంగా గాయాలు కావడంతో మల్కన్‌గిరి ప్రభుత్వాస్పత్రికి రిఫర్ చేశారు. కలిమెల ఐఐసి చంద్రకాంత్ తండి ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

మల్కన్‌గిరిలో స్వచ్ఛభారత్



మల్లికేశ్వర్ ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న అధికారులు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలో ఆదివారం ఆరో రోజు స్వచ్ఛభారత్ కర్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక మల్లికేశ్వర్ ఆలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ స్వచ్ఛతా కర్యక్రమాన్ని సాహిత్యం, పంచాయతీరాజ్, తాగునీటి సరఫరా, గృహనిర్మాణ, పర్యటకశాఖల సహకారంతో నిర్వహించారు. కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ పౌరుడు తన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రతీ మందిరం వద్ద నిర్వహించాలన్నారు. జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ చంద్ర శబర, సంజాయ్ సర్కార్, ఉద్యోగులు పాల్గొన్నారు.



మల్లికేశ్వర్ ఆలయ పరిసరాలను శుభ్రం చేస్తున్న మహిళలు

వైన్‌షాప్ నిర్వాహకుడిపై దాడి

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టిలోని ఓ మద్యం షాపు నిర్వాహకుడిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చాపర గ్రామానికి చెందిన కొందరు యువకులు మెళియాపుట్టిలోని మద్యం షాపులో నాలుగు బాటిళ్లు కొనుగోలు చేసి వెళ్లిపోయారు. కాసేపటి తర్వాత తిరిగి వచ్చి ఒక మద్యం బాటిల్ తిరిగి నిర్వాహకుడికి ఇచ్చి డబ్బులు అడిగారు. అందుకు ఆయన నిరాకరించడంతో వాగ్వాదానికి దిగారు. మద్యం మద్యం మత్తులో నిర్వాహకుడిపై దాడికి దిగి సీసాతో తలపై బలంగా మోదారు. అనంతరం పిడిగుద్దులతో దాడి చేశారు. నిర్వాహకుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నలుగురు యువకులపైనా కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు తెలిపారు.

నిమ్మ @ రూ.110

శ్రీకాకుళం: వేసవి ఎండల నేపథ్యంలో జిల్లాలో నిమ్మకాయల ధర ఒక్కసారిగా పెరిగిపోయింది. నెల రోజుల క్రితం రూ.50 నుంచి రూ.60 వరకు ఉన్న కిలో నిమ్మకాయల ధర ప్రస్తుతం రిటైల్‌లో రూ.110కు అమ్ముతున్నారు. హోల్‌సేల్‌లో రూ.95 వరకు ధర పలుకుతోంది. వేసవిలో నిమ్మకాయల వినియోగం ఎక్కువగా ఉండటంతో ధర పెరగడం పరిపాటి. ఏటా ఏప్రిల్ మాసాంతం నుంచి జూన్ మొదటి వారం వరకు ధర పెరుగుతునే ఉంటుంది. ఈ ఏడాది మాత్రం మార్చి చివరి వారం నుంచి ధర విపరీతంగా పెరిగిపోయింది. జిల్లాలో నిమ్మ పంట అంతంతమాత్రంగానే సాగవుతోంది. గుంటూరు, కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి నిమ్మ దిగుమతి అవుతోంది. ఆయా ప్రాంతాల్లో ఈ ఏడాది వర్షాలు అంతంత మాత్రంగా పడటం, మంచు ఎక్కువగా కురవడం వల్ల దిగుబడి తగ్గిపోయిందని, ఫలితంగా ధర పెరిగిపోయిందని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. మే చివరి నాటికి కిలో నిమ్మ ధర రూ.150 దాటిపోవచ్చని వ్యాపార వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

• ఆదిత్యా నమోస్తుతే..!



సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు

• భారీగా తరలివచ్చిన భక్తులు
• విధుల్లోకి దినసరి వేతనదారులు



ప్రసాదాలను విక్రయిస్తున్న దినసరి వేతనదారులు

అరసవల్లి : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఆదిత్యుని వార్షిక కల్యాణ మహోత్సవాలు (బ్రహ్మోత్సవాలు) జరుగుతున్న క్రమంలో ఇతర ప్రాంతాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇంద్రపుష్కరిణి వద్ద సంప్రదాయక పూజలు నిర్వహించి ప్రసాదాలను స్వామికి నివేదించారు. ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాలు పూజలు చేయించుకున్నారు. ఎండ వేడిమి తీవ్రంగా ఉన్న కారణంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆలయ ఈవో వై.భద్రాజీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయించారు.

విధుల్లోకి సిబ్బంది..

శనివారం విధులకు దూరంగా ఉన్న దినసరి వేతనదారులు ఆదివారం మాత్రం విధులకు వచ్చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన క్రమంలో వారికి సౌకర్యాల కల్పన నుంచి ఆలయంలో క్యూలైన్ల ఏర్పాటు, అన్నదానం, ప్రసాదాల తయారీ, విక్రయాలన్నీ దినసరి వేతనదారులే చూసుకున్నారు. ఈవో సూచన మేరకు ఈనెలాఖరు వరకు వేచిచూద్దామనే భావనను వ్యక్తం చేసి విధులను యధావిధిగా కొనసాగించారు. వివిధ దర్శనాల టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,12,600, పూజలు, విరాళాల ద్వారా రూ.60,521, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ. 1,15,880 వరకు ఆదాయం లభించినట్లు ఈవో వివరించారు.

ఆధ్యాత్మిక కేంద్రాల్లో శ్రమదానం



నబరంగ్‌పూర్ దేవాలయాలలో చీపుర్లతో మున్సిపల్ చైర్మన్ కును నాయక్, కౌన్సిలర్లు

కొరాపుట్: ఒడిశా స్వచ్ఛతా దినోత్సవాన్ని ఆదివారం జరుపుకున్నారు. ఇందులో భాగంగా కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాల్లో శ్రమదానంతో పరిసరాలను పరిశుభ్రం చేశారు. నబరంగ్‌పూర్‌లో మున్సిపల్ చైర్మన్ కును నాయక్ ఆధ్వర్యంలో జగన్నాథ, మా బండారు ఘరణి, మహాలక్ష్మి, నీలకంఠేశ్వర దేవాలయాలను శుభ్రం చేశారు. కౌన్సిలర్లు చీపుర్లు చేత పట్టకొని చెత్తని ఊడ్చారు. కొరాపుట్ జిల్లా కేంద్రంలోని శబరి శ్రీ క్షేత్ర జగన్నాథ దేవాలయ పరిసరాలను అక్కడి అధికారులు శుభ్రం చేశారు.



కొరాపుట్ జగన్నాథ మందిరం వద్ద అవగాహన కార్యక్రమంలో అధికారులు

రామగిరి క్షేత్రంలో ఐటీడీఏ పీఓ



రామగిరి క్షేత్రం పైకి కాలినడకన వెళ్తున్న పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

కొత్తూరు: మండలానికి ఆనుకుని ఉన్న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సీతంపేట మండలం పులిపుట్టి సమీపంలో ఉన్న కన్నెధార కొండపై నిర్మించిన రామగిరి క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన శ్రీరామనవమి వేడుకలకు ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి హాజరయ్యారు. సీతారాములను దర్శించుకొని తీర్ధ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు పీఓను సత్కరించి జ్ఞాపిక అందజేశారు. సీతారాముల కల్యాణోత్సవానికి కొత్తూరు, సీతంపేట మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలోహాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు పిండి శ్రీనివాసరావు, రామగిరి క్షేత్రం కమిటీ అధ్యక్షుడు ఎస్పీ పెంటయ్య, జి.రాములునాయుడు, రాజారావు, రాములు, జి.ప్రసాదబాబు, భాస్కరరావు ప్రిన్సిపాల్ నవీన్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు వినతుల స్వీకరణ

విజయనగరం అర్బన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించనున్న ప్రజా వినతుల పరిష్కార వేదికలో రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్, ఎన్‌ఆర్‌ఐ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొంటారని మంత్రి కార్యాలయం ప్రతినిధులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినతులు నేరుగా మంత్రి స్వీకరిస్తారని, ఈ అవకాశాన్ని అర్జీదారులు వినియోగించుకోవాలని కోరారు.

ఆటో బోల్తా..

- ఒకరి మృతి
- ఎనిమిది మందికి గాయాలు



సంఘటనా స్థలం వద్ద వివరాలు సేకరిస్తున్న ఎస్సై అమ్మన్నరావు

సీతంపేట: కుమారుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు వస్తూ ఓ తల్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. మరో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రాజన్నగూడకు చెందిన సవర లక్ష్మణ్ సీతంపేటలో గల అడ్వంచర్ పార్కులో గేట్‌మన్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం తన పుట్టినరోజును పార్కులో జరుపుకుంటానని చెప్పి భార్యాపిల్లలు, తల్లి, బంధువులను రమ్మని ఆహ్వానించాడు. దీంతో లక్ష్మణ్ తల్లి సవర పెద్దతిక్కమ్మ (60), భార్యా పిల్లలు, బంధువులు ఆటోలో స్వగ్రామం నుంచి అడ్వంచర్ పార్కుకు బయలుదేరారు. సరిగ్గా అక్కన్నగూడ వద్దకు వచ్చే సరికి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పెద్ద తిక్కమ్మ అక్కడికక్కడే మృతి చెందగా.. సవర ఉషారాణి, స్మిత్, రాషి, సునేమి, రాయమన్స్, సవర సౌజన్య, సవర లీనా, సవర సోహెల్ గాయపడ్డారు. వెంటనే వీరిని స్థానిక సీహెచ్‌సీకి తరలించగా.. ముగ్గురిని శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. తన పుట్టిన రోజునే తల్లి మృతి చెందడం.. కుటుంబ సభ్యులు గాయపడడంతో లక్ష్మణ్ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాడు. ఎస్సై వై. అమ్మన్నరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని బీజే పాలెం గ్రామానికి చెందిన కడుకట్ల అప్పన్న (60) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. శనివారం రాత్రి 10:30 గంటల సమయంలో బహిర్భూమి కోసం గ్రామ సమీపంలోని చెరువుకు వెళ్తుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై బి. లోకేశ్వరరావు తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరు..



రాజేష్ (ఫైల్)

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని కుందరతిరువాడ పంచా యతీ నీచుకవలస గ్రామానికి చెందిన పత్తిక రాజేష్ (24) విశాఖపట్నం గాజువాకలో నూతన గృహానికి పెయింటింగ్‌లు వేసేందుకు వెళ్లి అక్కడ గత నెల 28న విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే స్థానికులు కేజీహెచ్‌కు తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. కుటుంబాన్ని పోషిస్తున్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు శ్రీనివాసరావు, సునీత, తమ్ముడు రాకేష్ కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ప్రమాదవశాత్తూ మరొకరు..

చీపురుపల్లి: పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో ట్రాక్‌పై ప్రమాదవశాత్తూ ప్రసాద్ (55) అనే వ్యక్తి మృతి చెందాడని జీఆర్‌పీ హెచ్‌సీ మధుసూదనరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే.. రాజాం మండలంలోని బొద్దాం గ్రామానికి చెందిన ప్రసాద్ విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో పని చేస్తున్నారు. మూడు రోజుల కిందట తన స్వగ్రామమైన బొద్దాం వచ్చిన ఆయన తిరిగి విజయవాడకు వెళ్లేందుకు చీపురుపల్లి రైల్వేస్టేషన్‌కు శనివారం రాత్రి చేరుకున్నాడు. అయితే ప్రసాద్ రైలు నుంచి జారి పడి మరణించాడా.. లేక మరే ఇతర కారణాల వల్ల మరణించాడో అన్న విషయం తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య..

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కొండపాలేం గ్రామంలో కె.బాలరాజు (32) అనే వ్యక్తి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బాలరాజు తన భార్య పద్మతో కలిసి శ్రీకాకుళం జిల్లా పలాసలో చెప్పులు కుట్టుకుని జీవనం సాగిస్తుండేవాడు. బాలరాజుకు మద్యం అలవాటు ఉండడంతో నిత్యం భార్యతో గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో పలాస నుంచి కొండపాలెంలో ఉన్న తల్లి యశోద వద్దకు ఇటీవల వచ్చేశాడు. ఆదివారం ఉదయం తల్లితో గొడవపడి ఇంటికి సమీపంలో ఉన్న చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై బి.లోకేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేరడి సమీపంలో ఏనుగులు

భామిని: మండలంలోని నేరడి బీ సమీపంలో ఏనుగులు ఆదివారం కనిపించాయి. రబీ వరితో పాటు మొక్కజొన్న, కనకాంబరాలు, కూరగాయల పంటలు ధ్వంసం చేస్తున్నాయి. ఏనుగులు పంట చేలల్లో సంచరిస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు ఏనుగులను చూసేందుకు స్థానికులు ఆసక్తి కనబరుస్తున్నారు.

కార్మికులకు అండగా.. ఈ శ్రమ్

- పథకంపై అవగాహన అంతంతమాత్రమే
- జిల్లాలో అసంఘటిత రంగ కార్మికులు సుమారు 7 లక్షల మంది
- పథకంలో నమోదైన వారు 4,19,542 మంది
- అవగాహన కల్పించని అధికారులు



ఈ - శ్రమ్ కార్డులు



గ్రిగ్ కార్మికులకు ఈ-శ్రమ్ నమోదు చేస్తున్న కార్మిక శాఖ కమిషనర్, సిబ్బంది

విజయనగరం గంటస్తంభం: అసంఘటితరంగ కార్మికుల పట్ల విజయనగరం జిల్లా యంత్రాంగం నిర్లక్ష్యధోరణి అవలంభిస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన ఈ పథకాన్ని అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బహుళ ప్రయోజనాలు కలిగిన ఈ పథకం గురించి తెలిసిన వారే నమోదు చేసుకుంటున్నారు తప్ప తెలియని వారి గురించి ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా విజయనగరం జిల్లాలో సుమారు 7 లక్షల మంది వరకు అసంఘటిత రంగ కార్మికులుండగా.. ఇంతవరకు 4,19,542 మంది మాత్రమే ఈ పథకంలో నమోదు చేసుకున్నారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇంకా 2 లక్షల మంది పైచిలుకు నమోదు చేసుకోవాల్సి ఉంది.

కొరవడిన అవగాహన..

అధికారులు అవగాహన కల్పించకపోవడంతో ఈ పథకం గురించి ఎవ్వరికీ పెద్దగా తెలియడం లేదు. ప్రారంభంలో అధికారుల అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, కార్మిక సంఘాల నేతల సూచనలతో నమోదు చేసుకునేందుకు కార్మికులు పోటీపడ్డారు. ఇప్పుడు ఎక్కడా ఆ ఊసే లేదు. అసంఘటిత రంగ కార్మికులు, వలస కార్మికులు, చిరు వ్యాపారులకు భరోసా కల్పించేందుకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ ఈ - శ్రమ్ పోర్టల్‌ను ప్రారంభించింది. ఇందులో నమోదైన వారికి కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుంది. పైగా ఎన్నో సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతాయి. ఈ పోర్టల్‌ను ప్రారంభించి ఏడాది గడిచినా.. నేటికీ చాలా మంది దరఖాస్తు చేసుకోకపోవడంతో సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారు.

చేకూరే ప్రయోజనాలివి..

ఈ -శ్రమ్‌లో నమోదైతే 12 అంకెలు కలిగిన యూఏఎన్ కార్డులు అందజేస్తారు. ఈ కార్డులు ఉన్నవారికే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు, సంక్షేమ పథకాలను వర్తింపజేస్తారు. ఇందులో నమోదు చేసుకున్న ప్రతి కార్మికుడికీ ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తూ అంగవైకల్యం చెందితే రూ. లక్ష బీమా పరిహారం అందజేస్తారు. అలాగే ఇతర సంక్షేమ పథకాల్లో కూడా వీరికి ప్రాధాన్యం ఇస్తారు. వలస కార్మికులు ఎక్కడ ఉన్నారో గుర్తించి ఉపాధి మార్గాలు చూపిస్తారు. 60 ఏళ్లు దాటిన వారికి నెలకు రూ.3 వేల పెన్షన్ ఇస్తారు.

అర్హులు వీరే..

- వయసు 16 నుంచి 59 సంవత్సరాల మధ్యలో ఉండాలి.
- ఆదాయపు పన్ను పరిధిలోకి రాకూడదు.
- ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్ఓ), ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్ఐ) సదుపాయం లేని వారు.
- ఉద్యానవనాలు, నర్సరీలు, పాడి పరిశ్రమ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, అనుబంధ రంగాల కార్మికులు, టైలర్లు, డ్రైవర్లు, హెల్పర్లు, వీధి వ్యాపారులు, కల్లుగీత, రిక్షా కార్మికులు, చెత్త ఏరేవారు, కొరియర్ బాయ్‌లు, ఇళ్ల పనివారు, ఉపాధి వేతనదారులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, మధ్యాహ్న భోజనం వర్కర్లు, లోడింగ్/అన్‌లోడింగ్ కార్మికులు, తదితరులందరూ ఈ పథకానికి అర్హులు.

పథకంలో నమోదుకు కావాల్సిన పత్రాలు..

- ✔ సేవింగ్ బ్యాంక్ ఖాతా
- ✔ బ్యాంక్ ఖాతా ఐఎఫ్ఎస్‌సీ కోడ్
- ✔ రేషన్ కార్డు
- ✔ ఆదాయ ధృవీకరణ పత్రం
- ✔ ఆధార్ కార్డ్
- ✔ యాక్టివ్ మొబైల్ నంబర్ ఆధార్ కార్డుతో లింక్
- ✔ నివాస ధృవీకరణ పత్రం
- ✔ పాస్‌పోర్టు సైజ్ ఫొటో
- ✔ వయస్సు రుజువు పత్రం



జిల్లా కార్మిక శాఖ కార్యాలయం



ఆన్‌లైన్‌లో ఈ-శ్రమ్ కార్డుకు నమోదు చేసుకుంటున్న అసంఘటితరంగ కార్మికులు

అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం



ఈ-శ్రమ్ పథకంపై జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇప్పటివరకు ఆరుగురికి ప్రమాద బీమా పరిహారం రూ. 2 లక్షల చొప్పున అందజేశాం. ఒక ఇంటిలో ఎంతమంది ఉన్నా ఈ పథకానికి అర్హులే.

– ఎస్‌డీవీ ప్రసాదరావు, కార్మిక శాఖ ఉప కమిషనర్, విజయనగరం జిల్లా

ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లిపోతున్నారు..



దేశపాత్రునిపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌ను దొంగలించి అక్కడే పడేసిన డొక్కులు

కొత్తవలస: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ఎత్తుకెళ్లిపోతున్నారు. దేశపాత్రునిపాలెం గ్రామ సమీపంలోని ఓ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం రాత్రి ఎత్తుకెళ్లిపోయారు. గడిచిన రెండు నెలల వ్యవధిలో మండలంలోని పలు గ్రామాలలో ఏడు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయని ఏఈ అప్పారావు తెలిపారు. కంటకాపల్లి జగనన్న కాలనీలో -2, కాటకాపల్లి జగనన్న కాలనీలో -1, పెదరావుపల్లిలో -2, దాట్ల లే అవుట్‌లో రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ఎత్తుకెళ్లిపోయారని చెప్పారు. సింగిల్ ఫేజ్ (16 కేవీ సామర్థ్యం) ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్ సరఫరా ఉన్నప్పుడే దొంగలు చాకచక్యంగా కిందకు దించి అందులో గల కాపర్‌ను తీసుకొని ట్రాన్స్‌ఫార్మర్ డొక్కులను అక్కడే వదిలేసి వెళ్లిపోతున్నారు. ఒక్కో ట్రాన్స్‌ఫార్మర్ విలువ రూ. 2 లక్షలకు పైనే ఉంటుంది. దేశపాత్రునిపాలెంలో జరిగిన దొంగతనంపై గ్రామానికి చెందిన శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హ్యాకథాన్ పోటీల్లో లక్ష్మీపురం విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఆమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ హ్యాకథాన్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విశాఖపట్నంలోని హోటల్ గ్రీన్‌పార్క్‌లో నిర్వహించిన పోటీల్లో విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన 27 మంది విద్యార్థులు పాల్గొనగా.. లక్ష్మీపురం ఉన్నత పాఠశాలకు చెందిన రేగిడి పూర్ణిమ, తోట నిహారిక, బిందు మాధవి (8వ తరగతి) రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి సాధించారు. దీంతో అమెజాన్ సంస్థ పాఠశాలకు ఒక టీవీ, రెండు ల్యాప్‌టాప్‌లు, రెండు ట్యాబ్‌లు పంపించింది. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ఆవరణలో ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం. కృష్ణారావు, ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు, బి.ఎరకయ్య, సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు, పీఎంసీ చైర్‌పర్సన్ కర్నేన రమాదేవి, తదితరులు అభినందించారు.

గ్రావెల్ తవ్వకాలపై దాడి



సీజ్ చేసిన వాహనాలతో రెవెన్యూ అధికారులు

బొబ్బిలి రూరల్: మండలంలోని దిబ్బగుడ్డివలస చెరువులో ఎటువంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపడుతున్న గ్రావెల్ తవ్వకాలపై రెవెన్యూ అధికారులు ఆదివారం దాడి చేశారు. ఆర్ఐ కొల్లి రామకుమార్ ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు ఈశ్వరరావు, తదితరులు దాడి చేసి జేసీబీ, రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. వాహనాలను మైనింగ్ శాఖాధికారులకు అప్పగిస్తామని ఆర్ఐ రామకుమార్ తెలిపారు.

సైబర్ మోసగాడు అరెస్ట్ ?

- అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు
- నిందితుడు ఇంజనీరింగ్ విద్యార్థిగా గుర్తింపు



ఈనెల 2న సాక్షిలో వచ్చిన కథనం

వీరఘట్టం: హలో .. నేను వీరఘట్టం పోలీస్‌స్టేషన్ నుంచి ఫోన్ చేస్తున్నాను.. ఎస్సై గారు ఆస్పత్రిలో ఉన్నారు.. అర్జెంట్‌గా రూ.55 వేలు ఫోన్ పే ద్వారా కావాలని నమ్మబలికి 75693 41175 నంబర్ నుంచి ఫోన్ చేసి వీరఘట్టంనకు చెందిన ప్రతాప్ అనే వ్యక్తి నుంచి నిందితుడు రూ.28 వేలు కాజేశాడు. ఈ వ్యవహారంపై ఈనెల 2న సాక్షిలో 'కానిస్టేబుల్‌నని చెప్పి సైబర్ మోసం' శీర్షికన ప్రచురితమైన కథనంపై వీరఘట్టం పోలీసులు స్పీడ్‌గా స్పందించారు. ఎస్పీ ఆదేశాల మేరకు బాధితుడికి వచ్చిన 75693 41175 ఫోన్ నంబర్ ఆధారంగా సైబర్ నేరగాడి ఆచూకీ గుర్తించారు. ఫోన్ నంబర్‌ను ట్రాక్ చేయగా నిందితుడు కృష్ణా జిల్లా బాపట్లలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వీరఘట్టం పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ ఐదు రోజుల కిందట బాపట్లకు పయనమయ్యారు. ఎస్సై జి. కళాధర్ వీరఘట్టం నుంచి నిందితుడి ఫోన్‌ను ట్రాక్ చేస్తూ హెచ్‌సీ, కానిస్టేబుళ్లకు దిశానిర్దేశం చేశారు. దీంతో బాపట్లలో నిందితుడ్ని పోలీసులు ఆదివారం చాకచక్యంగా పట్టుకున్నారు. సైబర్ నేరానికి పాల్పడిన వ్యక్తి బీటెక్ చదువుతున్న ఇంజనీరింగ్ విద్యార్థిగా గుర్తించారు. ఈ సైబర్ నేరం వెనుక ఉన్న కుట్రదారులందరినీ పట్టుకునే ప్రయత్నంలో పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహిస్తున్నారు. నిందితుడ్ని సోమవారానికి వీరఘట్టంనకు తీసుకువస్తారని సమాచారం.

వాట్సాప్ గ్రూప్‌పై అనుమానాలెన్నో....

'వి.జి.టి.యం నీడ్ మనీ ట్రాన్స్‌ఫర్స్ వీరఘట్టం' అనే వాట్సాప్ గ్రూప్‌లో ఈ సైబర్ నేరానికి బీజం పడడంతో పోలీసులు ఈ గ్రూప్ అడ్మిన్‌తో పాటు పెద్ద ఎత్తున మనీ ట్రాన్స్‌ఫర్స్ చేస్తున్న వారిపై నిఘా వేశారు. ఈ గ్రూప్‌లో ఎవరికైనా డబ్బులు కావాలన్నా, ఫోన్ పే కావాలన్నా గ్రూప్‌లో ఉండే సభ్యులు గతంలో పెట్టిన మెసేజ్‌లు.. ఇంత వరకు జరిగిన అన్ని మనీ ట్రాన్స్‌ఫర్స్‌పై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారు. సైబర్ నేరగాడు నోరు విప్పితే అసలు దొంగలు ఎవరనేది తేలుతుంది.

కూటమిలో కుంపటి



పల్లా శ్రీనివాసరావుతో మాట్లాడుతున్న కోండ్రు వర్గీయులు (ఫైల్)

- జనసేనకు ఏఎంసీ చైర్మన్ పదవి
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కోండ్రు వర్గం

రాజాం: అధికారంలోకి వచ్చి ఏడాది గడవకముందే కూటమిలో అసమ్మతిరాగం కనిపిస్తోంది. రాజాం నియోజకవర్గంలో ఓ వైపు టీడీపీలో అంతర్గత పోరు నెలకొనగా.. మరోవైపు కూటమిలో భాగస్వామి అయిన జనసేనను కూడా టీడీపీకి చెందిన ఓ వర్గం వ్యతిరేకిస్తోంది. ఇటీవల కూటమి ప్రభుత్వం ప్రకటించిన ఏఎంసీ నామినేటెడ్ పదవిపై టీడీపీ కార్యకర్తలు అసమ్మతి రాగం వినిపిస్తున్నారు. ప్రధానంగా రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు చెందిన వర్గం జనసేన పార్టీకి ఏఎంసీ ఇవ్వడాన్ని తప్పుపడుతోంది. పదవి ప్రకటించిన రోజే రాజాంలోని టీడీపీ కార్యాలయంలో అత్యవసరంగా సమావేశమై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయంపై అసమ్మతి వినిపించారు. అక్కడితో ఆగకుండా ఈ నెల 5న విశాఖపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి పొగిరి కృష్ణవేణికి ఏఎంసీ ఎలా ఇస్తారంటూ ప్రశ్నించారు. వెంటనే ఏఎంసీ చైర్మన్ గిరీని రద్దు చేసి ఎమ్మెల్యే కోండ్రు సూచించిన వ్యక్తికి ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

ఆది నుంచే అసమ్మతి..

రాజాం నియోజకవర్గంలో 2019 సార్వత్రిక ఎన్నికల ముందు నుంచే టీడీపీలో వర్గపోరు ప్రారంభమైంది. అప్పట్లో కావలి ప్రతిభాభారతికి టిక్కెట్ ఇవ్వొద్దంటూ టీడీపీకి చెందిన ఓ వర్గం నిరసన తెలిపి కోండ్రు మురళీమోహన్‌ను తెరపైకి తీసుకువచ్చారు. 2019 ఎన్నికల్లో కోండ్రు మురళీమోహన్ ఓటమి చెందగా.. కావలి ప్రతిభాభారతి కుమార్తె గ్రీష్మ తెరపైకి వచ్చి పార్టీ కార్యక్రమాలు నిర్వహించింది. మళ్లీ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓ వైపు కోండ్రు వర్గం, మరో వైపు గ్రీష్మ వర్గం టికెట్ కోసం ప్రయత్నించగా.. ఊహించని విధంగా కోండ్రు టికెట్ సంపాదించి గెలుపొందారు. అనంతరం ఆయన సోదరుడు జగదీష్ షాడో ఎమ్మెల్యేగా అవతరించడంతో.. ఈ తంతు నచ్చని టీడీపీకి చెందిన మరోవర్గం పలుచోట్ల అసమ్మతి రాగం వినిపిస్తూనే పైకి సమాచారాన్ని చేరవేసింది. దీంతో అనూహ్యంగా కావలి గ్రీష్మ ఎమ్మెల్సీగా మళ్లీ తెరపైకి వచ్చింది. ఇప్పుడు ఎవరూ ఊహించని విధంగా జనసేన పార్టీకి చెందిన కృష్ణవేణికి ఏఎంసీ పదవి రావడంతో కోండ్రు వర్గం జీర్ణించుకోలేకపోతుంది. మొదటి నుంచీ తాము అనుకునేది జరగాలనే వైఖరితో ఉన్న కోండ్రు వర్గానికి ఈ వ్యవహారం నచ్చడంలేదు. దీంతో జనసేనకి ఏఎంసీ రద్దుచేసి తమకే ఇవ్వాలంటూ పట్టుబడుతున్నారు. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఎమ్మెల్యే ప్రమేయం ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది.

దాడి కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ వకుల్ జిందల్, వెనుక ముసుగులో నిందితుడు

విజయనగరం క్రైమ్: రెండు రోజుల కిందట యువతిపై దాడి చేసిన నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేశారు. ఈ మేరకు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడ్ని మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందల్ తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. గరివిడి మండలం శివరాం గ్రామంలో ఉంటున్న బాధిత యువతికి తన అన్న ద్వారా నిందితుడు గర్ల ఆదినారాయణతో పరిచయం ఉంది. నిందితుడు తరచూ బాధిత యువతి ఇంటికి వస్తుంటాడు. ఇదిలా ఉంటే బాధిత యువతి చెల్లెలు విజయవాడలో ఉంటోంది. నిందితుడు ఫోన్ ద్వారా ఆమెతో కూడా పరిచయం పెంచుకున్నాడు. కొద్ది రోజులుగా నిందితుడు ఆదినారాయణ ఫోన్‌లో బాధితురాలి చెల్లిని అసభ్య పదజాలంతో వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని ఆమె శివరాంలో ఉంటున్న సోదరికి చెప్పుకుంది. దీంతో బాధితురాలు తన చెల్లిని ఎందుకు వేధిస్తున్నావని ఆదినారాయణను నిలదీసింది. అలాగే చుట్టుపక్కల వాళ్లకు కూడా చెప్పడంతో ఆదినారాయణ బాధిత యువతితో గొడవపడ్డాడు. ఈ క్రమంలో ఈ నెల 5వ తేదీన ఇంటిలో వంటపాత్రలు శుభ్రం చేస్తున్న బాధిత యువతిపై నిందితుడు కత్తితో దాడి చేసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసులు నిందితుడ్ని పట్టుకునేందుకు ఐదు బృందాలను రంగంలోకి దించింది. గంటల వ్యవధిలో నిందితుడు పట్టుబడడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడ్ని త్వరగా పట్టుకున్న నేపథ్యంలో చీపురుపల్లి డీఎస్పీ రాఘవులు, గరివిడి ఎస్సై లోకేశ్వరరావులను ఎస్పీ అభినందించారు.

పోలీసుల సాక్షిగా రాములోరి కల్యాణం

- పెనసాంలో భారీగా మోహరించిన పోలీసులు
- ఉత్కంఠ పరిస్థితుల్లో శ్రీరామ నవమి వేడుకలు



రామ మందిరం సమీపంలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



పోలీస్ సిబ్బంది నడుమ కల్యాణం జరిపిస్తున్న గ్రామపెద్దలు

గంట్యాడ: మండలంలోని పెనసాంలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సీతారాముల కల్యాణం జరిగింది. పోలీసుల సాక్షిగా సీతారాములు మరోసారి ఒక్కటయ్యారు. అసలు కల్యాణం జరుగుతుందో.. లేదోననే ఉత్కంఠ శనివారం అర్ధరాత్రి 12 గంటల వరకు నెలకొంది. వివరాల్లోకి వెళితే.. పెనసాం గ్రామంలో 25 ఏళ్లుగా లెంక నారాయణప్పడు కుటుంబీకులు శ్రీరామ నవమి రోజున కల్యాణం జరిపిస్తూ వస్తున్నారు. అయితే ఈ ఏడాది కూటమి పార్టీకి చెందిన కొంతమంది ఎప్పుడూ ఒకే కుటుంబీకులు కల్యాణం జరిపించాలా... మార్చాలంటూ పట్టుబట్టారు. ఈ క్రమంలో 15 రోజుల కిందట పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. దీంతో గంట్యాడ పోలీస్ స్టేషన్, విజయనగరం ఆర్డీఓ కార్యాలయంలో పలుమార్లు చర్చలు జరిగాయి. ఏళ్ల తరబడి తమ కుటుంబ సభ్యులే సీతారాముని కల్యాణం జరిపిస్తున్నామని లెంక నారాయణప్పడు కుటుంబీకులు పోలీసులు, అధికారులకు చెప్పారు. అప్పట్లో గ్రామ పెద్దలు, మండల ప్రజాప్రతినిధుల సమక్షంలో లెంక నారాయణప్పడు కుటుంబీకులే కల్యాణం జరిపించాలంటూ చేసిన తీర్మానాలను సైతం అధికారులకు చూపించారు. అయినప్పటికీ కూటమి నేతలు అంగీకరించలేదు. విజయనగరం డీఎస్పీ పెనసాం గ్రామ పెద్దలు, మండల ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ, కూటమి కి చెందిన నేతలతో శనివారం రాత్రి కూడా చర్చలు జరిపారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఎట్టకేలకు లెంక నారాయణప్పడు కుటుంబీకుల్లో ఒకరు, కూటమికి చెందిన ఒకరు కల్యాణం జరిపించడానికి అంగీకరించారు. ఇరువర్గాలు అంగీకరించినప్పటికీ, శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదనే ఉద్దేశంతో గ్రామంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నలుగురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, 120 మంది వరకు ఇతర సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా 144వ సెక్షన్ విధించారు. అన్ని గ్రామాల్లో ప్రశాంతంగా సీతారాముల కల్యాణం జరిగితే.. పెనసాంలో పోలీసుల పహారాలో కల్యాణం జరగడంపై గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు. కల్యాణంలో జెడ్పీటీసీ సభ్యుడు వర్రి నరసింహమూర్తి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీరుబండి జైహింద్‌కుమార్, సర్పంచ్ కర్రోతు పాపాయ్యమ్మ , ఎంపీటీసీ సభ్యుడు లెంక మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

10న కురుపాంలో జాబ్ మేళా

పార్వతీపురం టౌన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి కల్పనలో భాగంగా పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ కలిగి 18 ఏళ్ల నిండి 28 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువతీ యువకులు ఈ ఉద్యోగమేళాలో పాల్గొనవచ్చని అన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత ఈ నెల 10వ తేదీ గురువారం ఉదయం 9గంటలకు కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు హాజరు కావాలని పిలుపు నిచ్చారు. ఈ జాబ్ మేళాలో 12 కంపెనీలకు చెందిన అధికార ప్రతినిధులు హాజరై, అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలోకి ఎంపిక చేసుకోవడం జరుగుతుందని అన్నారు. జాబ్ మేళాకు హాజరు కానున్న అభ్యర్థులు తమ వివరాలను హెచ్‌టీటీపీఎస్://నైపుణ్యం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నంబరుతో పాటు బయోడేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో ఉదయం 9గంటలకు డ్రైవ్ జరుగు ప్రదేశంలో హాజరు కావాలని ఆ ప్రకటనలో కోరారు. వివరాలకు 63034 93720, 89788 78557 నంబర్లను సంప్రదించాలని సూచించారు.